www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 ఫిబ్రవరి 2025 | 5 | తిరుపతి

రిటైర్డ్ స్టేషన్ మాస్టర్స్‌కు న్యాయం చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఎనభై ఏళ్ల తరువాత పెన్షన్ ఐదు శాతం పెంపును 65 సంవత్సరాల నుంచే పెంచాలని, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్స అమలు చేయాలని, ఫిక్స్‌డ్ మంత్లీ అలవెన్స్‌ను నెలకు వెయ్యి బదులుగా మూడు వేలు ఇవ్వాలని ఆల్ ఇండియా రిటైర్డ్ స్టేషన్ మాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మురళీధర్ డిమాండ్ చేశారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గ్రాడ్యుటీ చెల్లింపు 1972 ప్రకారం ఇవ్వడం లేదని, పెన్షన్ రూలు ప్రకారం తమకు సగటున రెండు మూడు లక్షలు తక్కువగా వస్తుందన్నారు. తమ అసోసియేషన్‌లో మొత్తం 747 మంది జీవితకాల సభ్యత్వంతో ఉన్నామన్నారు. రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ల అనుభవాలను శిక్షణా సంస్థల్లో కేస్ స్టడీల రూపకల్పనలో ఉపయోగించుకోవాలన్నారు.

మామిడి కాయకు తొడిగిన కవర్లు

'మామిడి'కి గిట్టుబాటు
'కవర్' అదుర్స్..!

- కవర్లతో రైతులకు రెట్టింపు ఆదాయం
- సగం ధరకే రైతులకు అందుబాటులో..
- పెద్దఎత్తున ఉద్యానవన శాఖ ప్రచారం
- 'మచ్చ'లేని మామిడి పంటే లక్ష్యం

గత ఏడాది పూత లేక, కాయ రాక మామిడి రైతులు నష్టాలను చవి చూశారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ముందస్తుగా ఉద్యానవన శాఖ మామిడి రైతులకు అవగాహన కల్పిస్తూ, రెట్టింపు లాభం వచ్చేలా 'కవర్ల' ప్రయోగాన్ని జిల్లావ్యాప్తంగా చేపడుతోంది. గత రెండేళ్లుగా ఉద్యావనవన శాఖ విస్తారంగా అవగాహన కల్పిస్తున్నా రైతుల్లో స్పందన తక్కువగానే ఉండేది. అయితే ఈ ఏడాది ఉద్యావన శాఖ అధికారులు సీజన్ ప్రారంభం నుంచి మామిడి తోటలకు ఏ మందులు వేయాలి, ఎంత మోతాదు వేయాలి, తెగుళ్ల బారిన పడకుండా కవర్లు వాడాలని విస్తారంగా మామిడి రైతులకు అవగాహన కల్పిస్తుండటం గమనార్హం.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి సాగు గణనీయంగా సాగవుతుంది. ఇక్కడ పండిస్తున్న మధుర ఫలాలను (మామిడిని)దేశ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే ఎగుమతుల సందర్భంగా ఎటువంటి మచ్చ లేకుండా నవనవలాడే పండ్లు కొనుగోలు చేయడానికే వ్యాపారులు సిద్ధపడతారు. ఈ నేపథ్యంలో 'కవర్ల' కల్చర్ ప్రారంభమయ్యింది. మామిడితో సస్యరక్షణ చర్యలు చేపడితే ఆశించిన ఫలితం రైతులకు గిట్టుబాటు అవుతుందని శ్రీకాళహస్తి ఉద్యానవన శాఖ అధికారి పుష్పలత 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1.50 వేల హెక్టార్లలో మామిడి సాగవుతుంది. దాదాపు 88వేల మంది రైతులు ఈ పంటపై ఆధారపడి సాగు చేస్తున్నారు. తిరుపతి జిల్లాలో 500 హెక్టార్లలో సాగవుతుంది. తూర్పు మండలాల్లో ఈ పంట సాగు తక్కువే అని చెప్పవచ్చు. పుత్తూరు, చంద్రగిరి, తిరుపతి రూరల్ నియోజకవర్గాల్లో పెద్దమొత్తంలో మామిడి సాగవుతుంది. మామిడి పంటలలో క్రిమి కీటకాలకు, ఎండలకు, రాళ్ల వానలకు తట్టుకునేలా కవర్లు కట్టడం ద్వారా నాణ్యమైన దిగుబడి రావడమే గాకుండా, రెట్టింపు లాభవం వస్తుందన్నది ఉద్యానవన శాఖ అంచనా. చిత్తూరు జిల్లాలో టేబుల్ రకాలైన బెనీషా, హిమాపసందు, ఖాదరు, మల్లిక, పునాసా తదితర రకాలు సాగవుతాయి.

రాయితీతో కవర్లు లభ్యం
పుష్పలత, శ్రీకాళహస్తి ఉద్యానవన శాఖ

జిల్లాలో మామిడి పంట సస్యరక్షణ చర్యల్లో భాగంగా 'కవర్ల'ను రాయితీతో ఉద్యానవన శాఖ అందిస్తుంది. ఎకరాకు 4వేల కవర్లు అవసరం అవుతాయి. కవరు 1.92 రూపాయల ధర పలుకుతుండగా, 50 శాతం రాయితీతో రూపాయికే అందిస్తున్నాం. ఎకరాకు 4వేల కవర్లు సరిపోతాయి. కవర్లు తొడగడం వల్ల కాయలు 30శాతం రాలవు. పండు ఈగకాటును నివారించవచ్చు. పక్షుల వల్ల నష్టం ఉండదు. కాయ సైజు వృద్ధి చెందుతుంది. మామిడికాయ పూర్తిగా పసుపు వర్ణములో రంగు వస్తుంది. దీంతో మంచి ధర పలుకుతుంది. సాధారణ ధర కన్నా రెండింతలు ధర పలుకుతుంది. తక్కువ ఖర్చుతోనే ఎక్కువ దిగుబడి సాధించేందుకు వీలుంటుంది.

'ఎట్టి'కి పోయి...శవమయ్యాడు..!

ప్రజాశక్తి - ఏర్పేడు

ఏర్పేడు మండలం రాజులపాలెం (ఎస్ఎస్ కెనాల్ ట్యాంక్) చెరువులో తూము నుంచి వృథాగా వెళుతున్న నీటిని అరికట్టేందుకు దిగి దళితవాడకు చెందిన మాదాసి గోపి కుమారుడు నడిపయ్య (42) ఊపిరాడక అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పంట పండి చేతికొచ్చిన సమయంలో చెరువు నుంచి వృథాగా వెళుతుండడంతో నీటిని అరికట్టేందుకు గ్రామస్తులంతా కలిసి తూము మూసివేయాలనుకున్నారు. ఈ నేపథ్యంలో నడిపయ్య ఇంటికి వచ్చి పిలుచుకెళ్లారని తెలుస్తోంది. నడిపయ్యకు జారుముడి వేసిన తాడుతో నడుముకు కట్టి తూము వద్ద పైనుంచి దించారు. వృథాగా వెళుతున్న నీటిని అరికడుతున్నపుడు ఒక్కసారిగా జారుముడి తాడు

'తూము'లో ఊపిరాడక దళితుడు మృతి

తెగి నడిపయ్య రిజర్వాయర్ అధిక ప్రవాహంతో చెరువు తూములోకి వెళ్లిపోయి ఊపిరాడక మృతిచెందాడు. కొంత సమయం తరువాత తూము నుంచి మృతదేహం పంట కాల్వలోకి కొట్టుకొచ్చింది. నడిపయ్య మరణవార్త విన్న కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. నడిపయ్యకు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు. 20 ఏళ్లుగా 'ఎట్టి' పని చేసుకుంటూ జీవనాధారం సాగిస్తున్నాడని సమాచారం. మృతిచెందిన వెంటనే అంత్యక్రియలు చేసేసినట్లు తెలుస్తోంది. ఊరి బాగుకోసం తూములో దిగిన నడిపయ్య మృతితో విషాద ఛాయలు అలముకున్నాయి. అధికారులు స్పందించి కుటుంబానికి ఆర్థిక సాయం చేసి ఆదుకోవాల్సి ఉంది.

పంట కాల్వలో కొట్టుకొచ్చిన మృతదేహం

ఏపీ పీజీసెట్‌ను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - క్యాంపస్

ఏపీపీజీసెట్‌ను రద్దు చేయాలని కోరుతూ సోమవారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిపాలన భవనం ఎదుట వందలాది మంది విద్యార్థులతో భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ , ఏఐఎస్‌ఎ, ఎన్ఎల్ఎస్ఏ, జిఎన్ఎస్, బీసీఎస్‌యు, జెబిఎస్ఎఫ్ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఒక వైపు విద్యార్థుల్ని ఉన్నత విద్యకు దూరం చేస్తున్న ఏపీపీజీ సెట్ ను రద్దు చేయాలని పదిరోజులకు పైగా వివిధ వర్సిటీలలో విద్యార్థులు పోరాటం చేస్తుంటే ఏమి పట్టనట్టు, మరోవైపు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ క్రికెట్ మ్యాచ్ చూడటానికి దుబాయ్‌కి వెళ్లాడని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెళ్లిళ్లకు, పేరంటాలకు తిరుగుతున్నాడని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సనాతన ధర్మాన్ని కాపాడతానంటూ పరిపాలన గాలికి వదిలేసి దేశంలోనున్న గుడులు చుట్టూ తిరుగుతున్నారన్నారు. యువత భవిష్యత్తు పట్టించుకుంటారని అధికారం ఇస్తే ఇవాళ వీరు చేసే పనులు ఇవా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి నిర్వహిస్తున్న ఉమ్మడి ఏపీపీజీసెట్ ను రద్దు చేయాలని ఎన్నికల ముందు పిజిసెట్ల నిర్వహణ గురించి ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోకపోవడం విద్యార్థులను మోసం చేయడమే అని అన్నారు. ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడే విధంగా ఏ యూనివర్సిటీకి ఆ యూనివర్సిటీయే పీజీ ప్రవేశాలకు పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకొని కామన్ పీజీ సెట్ ను రద్దు చేసి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల అసెంబ్లీని ముట్టడిస్తామని తెలిపారు. పీడిఎస్ఓ నాయకురాలు ఆశ, నాయకులు బండి చలపతి, అక్బర్ ,అశోక్, మల్లికార్జున, తిరుమలేష్, రంజిత్ కుమార్, శివ శంకర్ నాయక్ , సుందర రాజు, భార్గవ్, స్రవంతి, వినోద్,ప్రవీణ్, దామన కళ్యాణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిష్కరిస్తారని...గంపెడంత ఆశతో..

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 241 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుపతి జిల్లా పరిధిలో మారుమూల ప్రాంతాల నుండి క్షేత్రస్థాయిలో పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీ దారుడికి నాణ్యతతో కూడిన పరిష్కారం గడువులోపు చూపించాలని జిల్లా అధికారులనుకలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పెద్ద ఎత్తున అర్జీదారులు క్యూ కట్టారు. ఈ కార్యక్రమంలో మొత్తం 241 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 164 అధికంగా వచ్చాయి. జిల్లా కలెక్టర్ తో పాటుగా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రోజ్ మాండ్, శివ శంకర్ నాయక్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

- గ్రామీణ మారుమూల ప్రాంతాలకు సైతం అత్యవసర వైద్యసేవలను అందించే 108 ఉద్యోగులకు 2024, నవంబర్ 26న వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో ఇచ్చిన తొమ్మిది హామీల అమలుకు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికీ రెండు నెలలుగా జీతాలు రాలేదు. అయినా తిరుపతికి వచ్చే వివిఐపిల కాన్వాయిల్లో 108 సర్వీసు కొరత లేకుండా అధికారుల ఆదేశాలను పాటిస్తున్నాం. ఇకనైనా ప్రభుత్వం 108 ఉద్యోగుల పట్ల సానుకూల నిర్ణయం డిమాండ్ల సాధనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. ఈ మేరకు 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మహేష్, సునీల్, మునిరాజ, కేశవులు కలెక్టర్‌కు వినతిచ్చారు.
- మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ చెంచులక్ష్మి యానాది కాలనీలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జగనన్న ఇంటి పట్టాలు పొందిన వారికి స్థలాలు చూపాలని, పింఛన్లను మంజూరు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.
- తిరుపతి జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐటిడిఎ) కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని యానాది సంక్షేమ సంఘం నాయకులు మల్లికార్జున కోరారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా కేంద్రంగా ఆరు జిల్లాలలో ఉండే గిరిజనులకు ఒకే ఒక కార్యాలయం ఉంది. ఏదేని సమస్య చెప్పుకోవాల్సి వస్తే నెల్లూరుకు రావాల్సిన పరిస్థితి.
- వెంకటగిరి అర్బన్ లేఔట్‌లో మొత్తం ప్లాట్లు 2,511 వేయగా, 2300 మాత్రమే లబ్దిదారులకు మంజూరు చేశారని అధికారులు చెబుతున్నారు. అయితే మిగిలిన ప్లాట్లకు సంబంధించి పూర్తిస్థాయి నిర్మాణాలు జరగకపోయినా కమ్మి, ఇసుక, సిమెంట్ పూర్తిస్థాయిలో వినియోగించినట్లు లెక్కలు చూపి అవినీతికి పాల్పడినట్లు తెలుస్తోంది. 14వ వార్డు కౌన్సిలర్ ఎ.శంకరయ్య సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు కోరితే ఇచ్చారని తెలిపారు. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.
- ఏర్పేడు మండలం, వికతమాల గ్రామ లెక్క దాఖలా సర్వే నంబరు 132/5లో 1981లో అప్పటి ప్రభుత్వం ఎ.4.50 సెంట్లు భూమిని మా అమ్మ చింతచెరువు లక్ష్మీదేవిపై మంజూరు చేసింది. 1984-85 మధ్యన ఇదే సర్వే నంబర్లు 6 సబ్ డివిజన్లో ఎ4.37 సెంట్లు భూమి కొనుగోలు చేశాము. అప్పటి నుండి మా స్వాధీన అనుభవంలోనే సదరు భూమి ఉంది. అయితే మాకు తెలియకుండా మా భూమిలో జగనన్న లేఔట్ వేసి ప్లాట్లు కేటాయించారు. న్యాయం చేయాలనిబాధితులు వేడుకొన్నారు.

'ఆ స్కూలుకు' పంపించం..!

గిరిజన విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన / జీవో 117 రద్దు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - కోట

'ఉత్తమ నెల్లూరు' గ్రామంలోని పాఠశాలలోనే మా పిల్లలు చదువుకుంటారని, 3, 4, 5 తరగతుల కోసం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో స్కూలుకు మేము పంపలేమని గ్రామ ఎస్ఎంసి సభ్యులు, గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. ఇసుక లారీల రద్దీ ఎక్కువగా ఉండే ఆ స్కూలుకు తమ పిల్లల్ని పంపితే ప్రతిరోజూ ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో తాము కూలి పనులు చేసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 3, 4, 5 తరగతులను వేరో స్కూల్లో విలీనం చేస్తే తమ పిల్లలు చదువు మానుకోవాల్సి వస్తుందన్నారు. నూతన విద్యా విధానంలో భాగంగా జీవో నంబర్ 117 రద్దు చేస్తూ మోడల్ ప్రైమరీ స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు మినహా, 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో3, 4, 5 తరగతుల విద్యార్థులను దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోని గమళ్లపాలెం పాఠశాలలో విలీనం చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన

ఈ నేపథ్యంలో సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తమ గ్రామానికి చెందిన ఎంపిపిఎస్‌లో చదివే విద్యార్థులకు 1-5 వరకూ చదివే అవకాశం ఉందని, ప్రస్తుతం 3, 4, 5 తరగతులకు గమళ్లపాలెంలోని ఎంపియుపి స్కూలుకు పంపించాల్సిన అవసరం లేదన్నారు. గమళ్లపాలెంకు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఇసుక లారీలు నిరంతరం పోతూ ఉంటాయని, ట్రాఫిక్‌ను దాటుకుని తమ బిడ్డలు వెళ్లలేరని మొరపెట్టుకుంటున్నారు. మా బిడ్డలను 5 వ తరగతి వరకూ తమ గ్రామంలోని పాఠశాలలోనే చదివించుకునేలా చూడాలన్నారు. ఉత్తమ నెల్లూరు పరిధిలో ఎస్టీ (యానాది) కులానికి చెందిన పిల్లలు ఎక్కువగా ఉన్నారు. తమ బతుకుదెరువు కోసం తెల్లవారుజామునే పనులకు వెళ్లి పొద్దుపోయిన తరువాత ఇళ్లకు వస్తుంటారు. ఈ కారణంగా తమ పిల్లలను ఆ సమయానికి సిద్ధం చేసి, దూరంగా ఉన్న పాఠశాలకు పంపించలేమని, ఎపుడు ఏ ప్రమాదం జరిగి తమ బిడ్డలను పొట్టన పెట్టుకుంటుందోనని భయాందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గ్రామస్తులు తహశీల్దార్ కెజెజెరావు, ఎంఇఒ దారా మస్తానయ్య, ఎంపిడిఒ గోపిలకు వినతిపత్రం అందజేశారు. పరిశీలించి న్యాయం చేస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి సభ్యులు పద్మ, సురేఖ, అనిత, ప్రకాష్ ఉన్నారు. నూతన విద్యా విధానం అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నిర్ణయాలు తీసుకుని చిన్న పిల్లలను సైతం, దూర ప్రాంతంలోని పాఠశాలలకు వెళ్లేలా నిర్ణయాలు చేస్తూ, వారిని చదువుకు దూరం చేస్తుందని విద్యార్థిసంఘాల నాయకులు మండిపడుతున్నారు.

జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని, ప్రజలందరూ చికెన్, కోడిగుడ్లను నిరభ్యంతరంగా తినవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా సచివాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారి, డిఆర్ఓ నరసింహులుతో కలిసి జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధిపై వస్తున్న అపోహలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ పై వస్తున్న అపోహల కారణంగా పౌల్ట్రీ రైతులు నష్టపోతున్నారని, దీనిపై ప్రజలలో అవగాహన తీసుకువచ్చేందుకు నేడు బైరాగి పట్టెడ లోని శ్రీ బాబు జగ్జీవన్ రామ్ పార్క్ నందు చికెన్, కోడిగుడ్ల వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ, పౌల్ట్రీ బ్రీడర్స్ కో ఆర్డినేషన్ అసోసియేషన్, జిల్లా పౌల్ట్రీ రైతుల సంఘం, జిల్లా పశుసంవర్ధక శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారి రవి కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పశ్చిమ గోదావరి జిల్లాలో బర్డ్ ఫ్లూ రావడంతో అక్కడ జిల్లాలోని ప్రజలు చికెన్, కోడిగుడ్లు తినడానికి భయపడ్డారని, మన జిల్లాలో ఎటువంటి బర్డ్ ఫ్లూ లేదని తెలిపారు. 700 కేజీల చికెన్‌ను, 3వేల కోడి గుడ్లను స్టాల్స్ ఏర్పాటు చేసి, ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హోంసైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, డిడి ఉమా మహేశ్వరి, ఎన్ఇసిసి ఛైర్మన్ శ్రీనివాసులునాయుడు, బాలాజీ హేచరీస్ ప్రణీత్ పాల్గొన్నారు.

ముక్కంటి బ్రహ్మోత్సవాలకు సేవా కమిటీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం సేవా కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ కమిషనరు రామచంద్రమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సేవా కమిటీలో మొత్తం 20మందికి స్థానం కల్పించారు. ఈ కమిటీకి వచ్చే నెల 6వ తేదీ వరకు పదవీకాలం ఉంటుంది. సేవా కమిటీలో రంగినేని చెంచయ్యానాయుడు, డి.లక్ష్మమ్మ, ఎం.రవి, జి.విజయకుమార్, జి.గోపీనాథ్, వాకిచెర్ల గుర్రప్పశెట్టి, ఎం.మునిరాజాయాదవ్, కె.మల్లీశ్వరమ్మ, ఎం.జ్యోతి, నెమళ్లూరు సుబ్రహ్మణ్యం, జి.కష్ణవేణి, పోలూరు ప్రమీల, ఎన్.సూరినాయుడు, ఎం.సరస్వతి, కంఠారమేష్, బి.మునిలక్ష్మి, ఎం.సుబ్రహ్మణ్యంరెడ్డి, కెట్టే సాయి, అనిత, ఎ.సుమతి సభ్యులుగా ఉన్నారు. కాగా వాస్తవానికి ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలిని బ్రహ్మోత్సవాలకు మునుపే నియమిస్తారని ప్రచారం జరిగింది. అయితే సాంకేతిక, న్యాయపరమైన సమస్యలతో మండలి నియామకం ఆలస్యమైందని ఇటీవల దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పిన సంగతి తెలిసిందే. మండలి స్థానంలో మహాశివరాత్రికి సేవా కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి ఆనాడే చెప్పారు. ఆయన చెప్పినట్లు సేవా కమిటీని నియమించారు. ధర్మకర్తల మండలి నియమిస్తే అందులో ఈ సేవా కమిటీ సభ్యులకు ఎక్కువ ప్రాధాన్యత ఉంటుందని కూటమి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. సేవా కమిటీ నియామకం పట్ల కూటమి నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను గురించి ఆలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహాశివరాత్రి రోజున వేలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం ఆలయం నుంచి భక్తులను బయట పంపించే మెట్లు మార్గం పటిష్టంగా ఉండేలా చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ఆయన సూచించారు. అనంతరం ఎస్పీ హర్షవర్ధన్ రాజు పాత్రికేయులతో మాట్లాడారు. మహాశివరాత్రి రోజున శ్రీకాళహస్తిలో సుమారు 900మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అనుమానితులు, సంఘ విద్రోహక శక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఇందుకోసం ప్రత్యేక పోలీసు బందాలు ఏర్పాటు చేశామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఇక పిల్లలు తప్పిపోకుండా జియోట్యాగింగ్ విధానం అమల్లోకి తెస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎస్పీ వెంట శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి టి.బాపిరెడ్డి, ఆలయ ఈఈ మురళీధర్ రెడ్డి, ఏఎస్పీ రవిమనోహరాచారి, డీయస్పీ నరసింహమూర్తి, సీఐలు గోపి, వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, టీడీపీ నేత రంగినేని చెంచయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట పాటలతో అలరించిన సుద్దాల

ఆలోచింపజేసిన సుద్దాల 'మాట-పాట '

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ 'మాట..పాట' ఉత్తేజభరితంగా సాగి, ఆహుతులను ఆలోచింపజేసింది. శ్రీమన్నారాయణ మిత్రమండలి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ తనపల్లి వద్ద నున్న శ్రీనిలయంలో సోమవారం రాత్రి డాక్టర్ సుద్దాల అశోక తేజచే మాట పాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ దామోదర్ నాయుడు మాట్లాడుతూ నిస్తేజమైన మనుష్యులను ఉత్తేజపరిచే వాడే కవి అని, అలాంటి వ్యక్తి సుద్దాల అశోక్ తేజ అని కొనియాడారు. సాహితీప్రియులు వెంకటనారాయణ మాట్లాడుతూ సుద్దాల పాటలు మనుష్యులను జో కొడతాయని, అవసరమైతే తొడ కొట్టేలా చేస్తాయని తెలిపారు. సమాజ మార్పు కోసం కషి చేస్తున్న వ్యక్తుల్లో ఒకరు సుద్దాల అని పేర్కొన్నారు. సామాజిక రుగ్మతలు బాగా పెరిగిపోతున్న తరుణంలో కవులు ఆదర్శసమాజం ఏర్పాటు చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తారన్నారు. కవి ధర్మయ్య మాట్లాడుతూ సుద్దాల అశోక్ తేజ కవిత్వం ద్వారా కొనియాడారు. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ తల్లిదండ్రులు స్వాతంత్ర్య సమరయోధులు కావడంతో పోరాటాన్ని పుట్టుకతోనే అలవాటు చేసుకున్నా అన్నారు. ఉపాధ్యాయుడిగా పని చూస్తూనే అనేక కవితలు రచనలు రాశానని, సినీ కవిగా 2 వేల సినిమాల్లో, 3 వేల పాటలు రాశానన్నారు. ఒసేయ్ రాములమ్మ చిత్రం నుంచి వెనుతిరిగి చూడలేదన్నారు. మాట ఆగిపోయిన చోట పాట మాట్లాడుతుందని తెలిపారు. యువతను చైతన్య పరిచే కార్యక్రమంలో తాను. ముందుంటాను అన్నారు. అనంతరం సుద్దాల అశోక తేజ, ఆయన సతీమణి నిర్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, రామాంజనేయులు, వందవాసి నాగరాజు, చిన్నం పెంచలయ్య, మల్లారపు నాగర్జున పాల్గొన్నారు

జెఎస్‌డబ్ల్యు గ్రూప్ ఛైర్మన్‌కు అవార్డు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

జెఎస్‌డబ్ల్యు గ్రూప్‌ను ప్రపంచ సమ్మేళనంగా విస్తరించడంలో పరివర్తన నాయకత్వానికి గుర్తింపుగా గ్రూప్ ఛైర్మన్ సజ్జన్ జిందాల్‌కు 15వ ఎఐఎంఎ మేనేజింగ్ ఇండియా అవార్డులలో 'దశాబ్దపు వ్యాపార నాయకుడు' గౌరవం లభించిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డును కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, గౌరవ అతిథి వాణిజ్యం, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద సమక్షంలో జిందాల్‌కు ప్రదానం చేశారు. సజ్జన్ జిందాల్ నాయకత్వంలో, జెఎస్‌డబ్ల్యు గ్రూప్ అద్భుతమైన వద్ధిని సాధించిందని, దాని ఆదాయాలు 24 బిలియన్లకు రెట్టింపు అయ్యాయి.

బ్రహ్మోత్సవ బహుమానం ఇవ్వాలి!

టిటిడి పరిపాలన భవనం వద్ద సీఐటీయూ ధర్నా

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

టీటీడీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఎఫ్ఎంఎస్ కార్మికులకు లడ్డు ,వడ, బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించాలని కోరుతూ సోమవారం టిటిడి పరిపాలన భవనం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. టిటిడి కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి. సుబ్రమణ్యం మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు జరిగి నాలుగు నెలలు అవుతున్నా ఇంతవరకూ లడ్డు, వడ బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించలేదని అన్నారు. టీటీడీ యాజమాన్యం స్పందించి వెంటనే లడ్డు, వడ, బ్రహ్మోత్సవ బహుమానం ఇవ్వాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఎంప్లాయిస్ క్యాంటీన్ ఉన్న పద్ధతిలో, కాంట్రాక్ట్ కార్మికులకు క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరారు. లడ్డు కార్డు మంజూరు చేయాలని, దర్శన సౌకర్యం కల్పించాలని టిటిడి: యాజమాన్యాన్ని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నేతలు మాధవ్, వేణుగోపాల్, బుజ్జి, రమేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు రఘు, త్యాగ , ఏకాంబరం, ప్రభాకర్, సిద్దు, చిరంజీవి, ఉమాపతి, కేశవులు, కష్ణమూర్తి, రామకష్ణ, శంకరు, బాబు, ఆనందు,రీతా, శోభ, రుక్మిణమ్మ, లక్ష్మి, విజయలక్ష్మి, జమున తదితరులు పాల్గొన్నారు.

టిటిడి పరిపాలనా భవనం ఎదుట...

విద్యార్థులకు పరీక్ష సామాగ్రి వితరణ

పరీక్ష సామాగ్రి అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నాగలాపురం: నాగలాపురం మండలం, ఎస్.ఎస్.పురం ఉన్నతపాఠశాల 10వ తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్ష సామాగ్రిని వితరణగా అందించారు. ఎం.ఈ.ఓ బాబయ్య, ఇన్చార్జి హెచ్.ఎం చెన్న కేశవులు ఆధ్వర్యంలో తిరుపపట్టణానికి చెందిన పెద్దినేని హరికృష్ణ నాయుడు కుమారుడు ఎస్.ఆర్. వి యశ్వంత్ కుమార్ పది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఎం.ఈ.ఓ బాబయ్య మాట్లాడుతూ గత 10సంవత్సరాలుగా ప్రతి ఏడాది పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందిస్తున్న దాతలను అభినందించారు. విద్యార్థుల చిన్నారి చర్చికి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ గోపి వెల్ఫేర్ అసిస్టెంట్ గిరి, మాజీ కమిటీ చైర్మన్ రఘురామయ్య ఉపాధ్యాయులు బాబు, వెంకటేశ్వర్లు, చిరంజీవి, కంది శ్రీదేవి, చంద్రశేకర్, మోహన్, రంజిత్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని పోస్ట్ కార్డుల ఉద్యమం

ర్యాలీ చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి - వెంకటగిరి: ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ వెంకటగిరి మున్సిపల్ పోస్ట్ కార్మికులు సోమవారం పోస్ట్ కార్డులతో ర్యాలీ చేపట్టారు. పోస్ట్ కార్డులు చేత పట్టుకుని ర్యాలీగా బయలుదేరి ఆర్టీసీ బస్టాండ్ కాశీపేట మీదుగా పోస్ట్ ఆఫీస్ చేరుకుని, సీఎంకు రాసిన లేఖలను పోస్టు డబ్బాలో వేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు పట్టణ కార్యదర్శి ఎస్ ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి వి.పెంచలయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, రమణయ్య, పట్టణ ఉపకోశాధికారి హరిబాబు, కమిటీ సభ్యులు ఇందరమ్మ, శుభ రత్నమ్మ కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచన విరమించుకోవాలని కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు, సీఐటీయు నాయకులు కోరారు. ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గూడూరు, ఏ.పి.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పోస్టల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, సిఎం చంద్రబాబుకు పోస్ట్ కార్డులను పంపారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా, గౌరవ ధ్యక్షులు జోగి.శివకుమార్, పట్టణ కార్యదర్శి డి.కోటేశ్వరావు, సి.ఐ.టి.యు నాయకులు సురేష్, రమణయ్య, ఆదిపాల ప్రసాద్, మున్సిపల్ కార్మికులు ప్రసాద్, వెంకటయ్య, మణి, మణెమ్మ, ప్రమీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

అధికారులకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కేవీబీపురం: కెవిబిపురం మండలం ఆరే పంచాయతీ కార్యదర్శి తప్పుడు తేదీలతో మరణ ధ్రువ పత్రం మంజూరు చేశారని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి దాసరి జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల అభివృద్ధి అధికారికి, మండల తహసిల్దారుకు బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ఆరె గ్రామస్తుడు కె.మురళి ఆరె పంచాయతీ కార్యాలయంలో తేదీ 8- 5- 2023 నా, పంచాయతీ కార్యదర్శి ఎవరి ప్రలోభాలకో లొంగి, మరణించిన తేదీని 8-3-2023గా మార్చాడని మండిపడ్డారు. దీనివల్ల ఒకరి ఉద్యోగం పోయేందుకు కారణమయ్యారని అధికారులకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన మరణ ధ్రువీకరణ పత్రం సరైనది అయితే మరణించిన వ్యక్తి 2023 ఏప్రిల్, మే నెల్లో పింఛను ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు? తగు విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలపై కఠిన చర్యలు

అవగాహన కల్పిస్తున్న ప్రగతి సంస్థ సభ్యులు

ప్రజాశక్తి - కె వి బి పురం: కెవిబి పురం మండలం, జడ్పీ హై స్కూల్లో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రాజారెడ్డి మాట్లాడుతూ బాల్యవివాహాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిసినట్లయితే చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 కి సమాచారం అందించాలని కోరారు. సచివాలయం సిబ్బంది, మహిళా పోలీస్, ప్రగతి సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ రవి కుమార్, ఉపాధ్యాయులు, మహిళా పోలీస్ శేఖరన్, ప్రగతి సంస్థ కమ్యూనిటీ సోషల్ వర్కర్ మధు కుమార్, మల్లికార్జున, లత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్: నియోజకవర్గ పరిధిలోని చెరువుల మరమ్మత్తులు, కాలువల మరమ్మత్తులకు దాదాపుగా 200 పనులకు ఎఫ్.డి.ఆర్ నిధుల కింద 16 కోట్ల 23 లక్షల 56 వేల రూపాయల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రికి గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. గూడూరు మండల పరిధిలో 22 పనులకు 2 కోట్ల రూపాయలు, చిల్లకూరు మండల పరిధిలో 62 పనులకు 3 కోట్ల 98 లక్షల రూపాయలు, కోట పరిధిలో 23 పనులకు 2 కోట్ల 44 లక్షల రూపాయలు, వాకాడు మండల పరిధిలో 31 పనులకు 2 కోట్ల 12 లక్షల రూపాయలు, చిట్టమూరు మండలం పరిధిలో 62 పనులకు 5 కోట్ల 68 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నియోజకవర్గ పరిధిలో ఒక్క అభివృద్ధి పని జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది నెలలోనే నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు.

అపాచీ పరిశ్రమ బస్సు బోల్తా

బోల్తాపడిన బస్సు

ప్రజాశక్తి - వరదయ్యపాళెం: బస్సు బోల్తా పడి కొంత మంది కార్మికులకు స్వల్ప గాయాలైన సంఘటన మండలంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానిక ఎస్పై మల్లికార్జున్ అందించిన సమాచారం మేరకు వరదయ్యపాళెం మండలం సంతవేలూరు గ్రామానికి చెందిన అపాచీ పరిశ్రమ బస్సు కార్మికులను తీసుకెళుతూ, ఎదురుగా వస్తున్న మరో వాహనానికి సైడ్ ఇవ్వబోయి అదుపుతప్పి బోల్తా పడినట్లు తెలిపారు. ఇందులో పలువురు పరిశ్రమ కార్మికులు ఉన్నారని తెలిపారు. వారు స్వల్ప గాయాలతో బయటపడటంతో కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు ఉన్న వాహనంలో హుటాహుటిన గాయపడిన వారిని సూళ్ళూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భూపయ్య కాలనీ.. బాధలు తొలగనీ..

- అభివృద్ధికి ఆమడ దూరంలో భూపయ్య కాలనీ
- కాలనీ దారికి అడ్డుగా గోడ కట్టిన నాయకుడు
- దారి మూసి నెలలు గడుస్తున్నా స్పందించని అధికారులు
- బలహీన వర్గాలపై దౌర్జన్యాలు
- కాలనీవాసులకు న్యాయం చేయండి :సిపిఎం

దారికి అడ్డంగా నిర్మించిన గోడ

సోమవారం పరిశీలనకు వచ్చిన ఎమ్మార్వో

ప్రజాశక్తి - నాయుడుపేట:100కు పైగా కుటుంబాలు, 300 మందికి పైగా జనాభా, 50 మందికి పైగా చదువుకుంటున్న పసిపిల్లలు, కూలీనాలీ చేసుకుని బతికే బడుగు బలహీన గిరిజనులు. ఇది తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గం, నాయుడుపేట పట్టణ పరిధిలోని భూపయ్య గిరిజన కాలనీ సంబంధించిన జీవన చిత్రం. ఇక్కడ ఈ కాలనీ ఏర్పడి 50 సంవత్సరాలపైనే అవుతోంది. ఇన్నాళ్ల లేనిది ఇప్పుడు ప్రత్యేకించి చెప్పుకోవాల్సిన అవసరం ఏముం దంటే.. ఇప్పుడు వీళ్ళపై జరుగుతున్న దౌర్జన్యాల కారణం గానే ఇప్పుడు ప్రస్తావించవలసి వచ్చింది. పట్టణానికి చివరలో ఉన్న వీళ్ళ కాలనీ నుంచి వీరంతా జీవనోపాధి కోసం, చదువుల కోసం పట్టణంలోకి వెళ్లేందుకు ఉన్న ఒకే ఒక్క దారిని ఒక నాయకుడు మూసివేసి కాలనీకి అడ్డుగా గోడ కట్టడమే. ఈ గోడ కట్టి ఆ దారినే కాదు, వీళ్ళ బతుకు లను సైతం మూసివేసే ప్రయత్నం చేస్తున్నాడా నాయ కుడు. ఆ దారిలో కాకుండా వీళ్ళు పట్టణంలోకి వెళ్లాలంటే నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు తిరిగే హైవే మీద నుంచి కిలో మీటర్ పైన చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. పెద్దవాళ్లయితే తప్పనిసరి పరిస్థితుల్లో చుట్టూ తిరిగి వెళ తుంటారు. కానీ ఆ గోడ పక్కనే ఉన్న అంగన్వాడి స్కూల్‌కు వెళ్లే ఐదు సంవత్సరాలు కూడా లేని పసిపిల్లలు, ప్రాథమిక, హైస్కూల్‌కు వెళ్లే పిల్లలు వేరే గత్యంతరం లేక హైవేపై వెళ్లక తప్పడంలేదు. ఏరోజు ఏ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రుల ఆందోళన చెందుతున్నారు.

ఒక నాయకుడి కోసం వందల మంది జీవితాలతో ఆటలాడడం సరైన పద్ధతి కాదు. ఎలక్షన్లు వచ్చినప్పుడు వీరి దగ్గరకు వచ్చి, మీకు అది చేస్తాం ఇది చేస్తాం అంటూ ప్రగల్భాలు పలికే నాయకులు ఇప్పుడు ఏమైపోయారు. దాదాపుగా 20 రోజుల నుంచి ఈ దారి కోసం పోరాడుతుంటే నాయకుల్లో గానీ, అధికారుల్లో గానీ ఏమాత్రం చలనం కలగకపోవడం విచారించదగ్గ విషయం. ఈ సమస్యపై కాలనీవాసులు, నాయకులను కలిసినా, రెవెన్యూ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించిన ఫలితం శూన్యం. నాయుడుపేట తాహశీల్దార్‌కు సమస్యను పలుమార్లు విన్నవించినా, మీనమేషాలు లెక్కపెడుతున్నారే తప్ప అడుగు ముందుకు పడడం లేదు. సమస్యను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతాం.

- శివకవి ముకుంద, సిపిఎం నాయకులు

గత ఎన్నికల్లో ఒక నాయకుడికి సహరించలేదన్న కారణంతో మాపై కక్షబూని ఇలాంటి ఇబ్బందులు పెడుతున్నాడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ నాయకుడే దారికి అడ్డుగా కంపనాటితే, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దానిని పెరికి వేయించారు. ఆ నాయకుడికి ఈ స్థలంపై అప్పుడు లేని హక్కు ఇప్పుడు ఎలా వచ్చింది? విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిష్కరించాలి.

- అద్దూరు అంకయ్య, కిలారి వీరయ్య
భూపయ్య కాలనీ అభివృద్ధి సంఘం అధ్యక్ష కార్యదర్శులు

భూపయ్య కాలనీ గిరిజనులకు న్యాయం చేస్తాం

పది రోజులు ముందు భూపయ్య కాలనీవాసులు సిపిఎం నాయకులతో కలిసి వచ్చి గోడ సమస్యపై వినతిపత్రం ఇచ్చారు. ఈ స్థలాన్ని ఆర్ఐ సాయి కృష్ణ, సర్వేయర్ చరణ్‌లను పంపించి సర్వే చేయించాం. సోమవారం సాయంత్రం నేను కూడా పరిశీలించాను. ఈ స్థలానికి సంబంధించిన పట్టా తన వద్ద ఉందని బిజెపి నేత రంగినేని కృష్ణయ్య అంటున్నాడు. పత్రాలతో రెవెన్యూ కార్యాలయానికి రావాల్సిందిగా ఆదేశించాం. పరిశీలించి తర్వాత నిర్ణయం తీసుకుంటాం. భూపయ్య కాలనీ గిరిజనలకు న్యాయం చేసేందుకు పూర్తిగా సహకరిస్తాం.

- ఎమ్మార్వో రాజేంద్ర

పట్టణ పరిధిలో ఉన్న అభివృద్ధికి నోచుకోలేక పోతున్నాం, ఏళ్ల తరబడి పట్టణ పరిధిలో ఉంటున్న మా కాలనీ ఇప్పటివరకు అభివృద్ధికి నోసుకోలేదు. సరైన రోడ్లు లేవు. వీధి దీపాలు లేవు. ఇపుడు ఈ గోడ సమస్యతో మా బతులకు మరింత సమస్యల మయమయ్యాయి. ప్రభుత్వాలు మారినా మా బ్రతుకులు మారడం లేదు. కష్టనష్టాకోర్చి కూలి నాలి చేసుకుని జీవనం సాగిస్తుంటే ఎన్నడూ చూడని విధంగా ఇలా దారికి అడ్డంగా గోడ నిర్మించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

- దామర పరమేశ్వరి, కిలారి నాగమ్మ.. భూపయ్య కాలనీ మహిళలు

మందులు, టీ-షర్టుల వితరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు, మోత కూలీల సౌకర్యార్థం సాగర్ సిమెంట్ యాజమాన్యం సోమవారం రూ.5 లక్షలు విలువచేసే మందులు, టీ-షర్టులను వితరణగా అందజేసింది. ఆ కిట్లను నాయుడుపేటకు చెందిన సాగర్ సిమెంట్ డీలర్స్ రమేష్, సురేష్ ఈవోకు అందించి భక్తులు, మోత కూలీల అవసరార్థం వినియోగించాలని కోరారు.

ఖాళీ స్థలాలకు పన్నులు విధించండి : కమిషనర్

తిరుపతి టౌన్ : నగర పాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలకూ పన్నులు విధించాలని, చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 43, 44 వార్డుల్లో కార్పొరేటర్ నారాయణ, హెల్త్ ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పలు ఖాళీ స్థలాల్లో అపరిశుభ్రంగా ఉండటం వల్ల ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు ఆ స్థలాలను పరిశీలించి, పన్నులు వేసి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. మరమ్మతుకు గురైన డ్రైనేజీ కాల్వలను సరిచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రోడ్లపై గుంతలను పూడ్చాలన్నారు. ఇంటింటి చెత్త సేకరవణ మరింత పక్కాగా చేపట్టాలన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ. రమణ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

5కల్లా 'పల్లెపండుగ' పనులు పూర్తవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : 'పల్లెపండుగ' కార్యక్రమంలో భాగంగా పురోగతిలో ఉన్న పనులను వేగవంతం చేసి, మార్చి 5 నాటికి పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని, ఎలాంటి అలసత్వం సహించేది లేదని జూమ్ మీటింగ్ ద్వారా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్‌తో కలిసి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి పంచాయతీరాజ్, డ్వామా అధికారులతో పల్లె పండుగ పనులపై వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గ్రామ అభివృద్ధి పనులు, సిసి రోడ్లు, అనిమల్ షెడ్స్‌పై పురోగతి చూపాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లక్ష్యం మేరకు ఇంజినీరింగ్, సిసిరోడ్ల నిర్మాణం, అనిమల్ షెడ్స్ తదితర పనులు వేగవంతం చేయాలన్నారు. అధిక మండలాలు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయని, పురోగతి చూయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇఇ, డిఇలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో ఫ్యామిలీ బ్లూమ్ వేడుకలు

తల్లిదండ్రులకు పాద పూజ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, పరమేశ్వర మంగళం శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాం లో భాగంగా ఫ్యామిలీ బ్లూమ్ వేడుకలు సోమవారం ప్రిన్సిపాల్ కె.గోపి. ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుటుంబ బంధాలను బలోపేతం చేయడం మరియు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల మధ్య సమాజ చైతన్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా శ్రీ చైతన్య టెక్నో పాఠశాల ఫ్యామిలీ బ్లూమ్ అనే కార్యక్రమం నిర్వహించామని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ వినోద్, సి-ఇంచార్జ్ దివాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ధర్నా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: న్యాయవాదుల చట్టం నూతన సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ పుత్తూరు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు కె.పురుషోత్తం అధ్యక్షతన న్యాయవాదులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న న్యాయవాదుల చట్టం నూతన సవరణ బిల్లు 2025ను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నారన్నారు. తాము సైతం ఈ బిల్లును వ్యతిరేకిస్తూ విధులను బహిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.సంజీవి, వేషాచలం, రాజేష్, చంద్రశేఖర్, సుబ్రమణ్యంరెడ్డి, భాస్కర్ ఆచారి, కుమరవెల్, మాధవరాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

తిరుపతి సిటీలో... కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అడ్వకేట్ బిల్ కు వ్యతిరేకంగా తిరుపతి బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. నూతన చట్టం సవరణ 2025ను రద్దు చేయాలని కోరుతూ రెండు రోజులు పాటు నిరసన వ్యక్తం చేయాలన్న కేంద్ర కమిటీ మేరకు తిరుపతి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీచంద్, జనరల్ సెక్రెటరీ మార్టిన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణులు ధర్నా

ప్రజాశక్తి - తిరుపతి : కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ దగ్గర కాంగ్రెస్ శ్రేణులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ రుయా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు. పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలన్నారు. అలిపిరి వద్ద నిర్మిస్తున్న చిన్నపిల్లల ఆసుపత్రి భవనాన్ని రుయాకు కేటాయించాలని కోరారు. అన్నారావు హయాంలో ఏర్పాటైన రుయా ఆసుపత్రి అరాకొర సౌకర్యాలతో నడుస్తోందన్నారు. ఈ మధ్య కాలంలో కూటమి నేతలు పాపాలు ఎక్కువైనాయని మండిపడ్డారు. 292 కోట్లు రూపాయలు నిధులు దారి మళ్లించారని పేర్కొన్నారు. జగన్ బటన్ నొక్కాడు. ఇంటికి పోయాడని ఎద్దేవా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, తేజోతి, ముని శోభ, అబ్దుల్ మజీద్ పటేల్, రావణ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారత ప్రాచీన విద్యపై శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలోని మాలవ్య మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్‌లో యుజిసి సహకారంతో ఫిబ్రవరి 24 నుంచి మార్చి 1 వరకు భారతీయ వేదిక జ్ఞాన విద్యా విధానం సమూపార్జనకు ఆరు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని వర్సిటీ భౌతిక శాస్త్ర విభాగ "సదస్సు శాల" లో వర్సిటీ ఉపకులపతి ఆచార్య అప్పారావు, వేదిక్ వర్సిటీ ఉపకులపతి రాణి సదాశివమూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై ధర్నా

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పనులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించరాదని, మున్సిపల్ కార్మికులు, యూనియన్ గౌరవ అధ్యక్షుడు డి.మహేష్, కార్మికుల అధ్యక్షులు విజయ్ కుమార్ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు విజయకుమార్ మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దుపరిస్తే మున్సిపల్ శాఖకే ఆ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన మహేష్ మాట్లాడుతూ కనీస వేతనలు 35000 చెల్లించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులనుతక్షణమే పర్మినెంట్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాకోబ్, ప్రభాకర్, తంగవేలు, సురేష్, కృష్ణారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభకు అభినందన

విజేతలను అభినందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విద్యార్థులు ఇటీవల కేరళ, గురువాయుర్ క్యాంప్‌లో నిర్వహించిన రూపకమహోత్సవంలో నాటక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. శరణ్ బి.భట్ వ్యక్తిగత డ్రామా కేటగిరిలో ఉత్తమ నటుడు అవార్డును, జమున సోలోవాల్‌కు వ్యక్తిగత నటనా కేటగిరిలో ఉత్తమ నటి అవార్డు సాధించారు. ఉత్తమ నటి కేటగిరిలో జాతీయ విశ్వవిద్యాలయానికి పురస్కారం లభించింది. ఈ సందర్భంగా విజేతలను, అందులో పాల్గొన్న విద్యార్థులను విశ్వవిద్యాలయం విసి ఆచార్య జియస్ఆర్ క్రిష్ణమూర్తి, విశ్వవిద్యాలయ కల్చరల్ పూర్వ కో-ఆర్డినేటర్ డా.నారాయణ, వేమభూపాల కళాపరిషత్ కో-ఆర్డినేటర్, సాహిత్య విభాగ అధ్యాపకురాలు డా.కె.లీనాచంద్ర, విద్యార్థిబృందానికి గైడ్స్‌గా వ్యవహరించిన జ్యోతిష్య విభాగాధిపతి డా.నారాయణ, అధ్యాపకులు డా.ధర్మదాసన్, కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకురాలు డా.జి.నాగలక్ష్మి అభినందించారు.

విభిన్న ప్రతిభావంతునికి వీల్ చైర్

కలెక్టర్‌తో ఆనందంగా విభిన్న ప్రతిభావంతుడు వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సీఎం ఆదేశానుసారం సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని ఆధవరం గ్రామానికి చెందిన వలమల వెంకటేశ్వర్లు అనే విభిన్న ప్రతిభావంతునికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బ్యాటరీ కం ఎలక్ట్రికల్ వీల్ చైర్‌ను సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో అందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి శ్రీనివాస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫారం పాండ్స్‌తో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - ఏర్పేడు : మండలంలోని బండారు పల్లి పంచాయతీలో రైతుల పొలంలో తువ్వుతున్న ఫారం పాండ్ పనులను సోమవారం పథక సంచాలకులు సివి శ్రీనివాస్ ప్రసాద్ ఆకస్మికంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు, కూలీలకు ఫారం పాండ్‌లు తవ్వుకొనడం వల్లన కలుగు ప్రయోజనాలను తెలియజేశారు. వర్షపు నీరును ఒడిసి పట్టి ఫారం పాండ్‌లలో నీటిని నిల్వ చేసుకొనడం వల్లన భూగర్భ జల్లాలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఫారం పాండ్‌లో నీరు భూమిపై నుండి 2 మీటర్ల లోతు వరకు ఉండడంవల్ల, భూమిలో తేమ శాతం పెరిగి పంట పొలాలకు నీరు సమృద్ధిగా ఉంటుందన్నారు. మిత్ర పురుగులు, వాన పాములు ఫారం పాండ్‌లు తువ్వుకొన్న రైతులు పొలాల్లో అధికంగా వృద్ధి చెందుతాయన్నారు. ఫారం పాండ్ గట్టు చుట్టూ భూ మి వృధా కాకుండా కొబ్బరి చెట్లు, ఇతర పండ్ల చెట్లు పెంచు కొనడం, పాండ్స్‌లో చేపల పెంపకం చేపడితే రైతులు అదనపు ఆదాయం చేకూరుతుం దన్నఆరు. ఇటు వంటి బహుళ ప్రయోజనాలు పొందే అవకాశం ఉన్నందున, రైతులు తమ పంట పోల్లాలో ఫారం పాండ్స్ తవ్వుకొనుటకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్ర శేఖర్ రాజు, అవి లాల దేవరి, మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివ చంద్ర, టెక్నికల్ అసిస్టెంట్ రవీంద్రుడు, జెఈ బాలాజీ రావ్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఫారం పాండ్ పనులను పరిశీలిస్తున్న పథక సంచాలకులు సి.వి.శ్రీనివాస్ ప్రసాద్

యూనియన్ బ్యాంక్‌ను సందర్శించిన నాగలాపురం సీఐ

ప్రజాశక్తి నాగలాపురం: నాగలాపురం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో ఖాతా దారులు తాకట్టు పెట్టిన బంగారు నగలను అక్కడ పనిచేసే ఉద్యోగస్తులు గోల్మాల్ చేసిన తెలిసిన విషయమే. ఈ క్రమంలో యూనియన్ బ్యాంక్ ఉన్నత అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసును నమోదు చేశారు. సోమవారం సత్యవేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి బ్యాంక్‌ను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ప్రస్తుత మేనేజర్ బానావత్ నాగమునీంద్ర నాయక్‌ని విచారించారు. ఖాతాదారుల వివరాలతో సత్యవేడు సర్కిల్ ఆఫీస్ వద్దకు రావలసిందిగా ఇన్స్పెక్టర్ మురళి మేనేజర్‌ను కోరారు.

గిరిజనులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా, సత్యవేడు మండలం, పేరడం గ్రామంలో నివసిస్తున్న అర్హులైన గిరిజనులకు ఇంటి స్థలాలు కేటాయించాలని సిపిఎం మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం గిరిజనులు నిరసన పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ గిరిజన కుటుంబాలు పలువురు ఇంటి పట్టాల కోసం గత రెండున్నర సంవత్సరాలుగా పోరాడుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలు మంజూరు చేసి తాగు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, దారి ఏర్పాటు చేసి సిమెంట్ రోడ్లు నిర్మించి న్యాయం చేయాలని కోరారు. గిరిజనులతో కలిసి ఇంచార్జ్ ఆర్ఐ సురేష్‌కు వినతి పత్రం సమర్పించారు.

జగనన్న అర్బన్ లేఔట్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి -వెంకటగిరి : వెంకటగిరి, జగనన్న కాలనీ అక్రమాలపై ఉన్నత స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక 14వ వార్డు కౌన్సిలర్ ఆది శంకరయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తిరుపతి కలెక్టర్ ఆఫీసులో జాయింట్ కలెక్టర్‌ని కలిసి హౌసింగ్ అధికారులు చేస్తున్న అవినీతిపై ఫిర్యాదు చేశానని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జగనన్న లేఔట్‌లో మంజూరైన ఇళ్ళు, లబ్దిదారులకు ఇచ్చిన ఇళ్లు పోగా మిగిలిన వాటి వివరాలు అడిగితే హౌసింగ్ అధికారులు తెలియజేయడం లేదన్నారు. ఇళ్ల నిర్మాణంలో కూడా అవినీతి జరిగిందన్నారు. ఇసుక, సిమెంట్, కమ్మి, ఇటుక స్వాహాచేశారన్నారు.

బీజగణితంపై కార్యశాల కరపత్రం ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయు గణిత శాస్త్రం, ఐసర్-తిరుపతి ఆధ్వర్యంలో మార్చి 12 నుంచి 14 వరకు "బీజగణితము, బీజగణిత సంఖ్యా సిద్ధాంతం, వాటి అనువర్తనాలు - 2025" అనే అంశం మీద మూడు రోజుల కార్యశాల యొక్క కరపత్రాన్ని వర్సిటీ వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం కన్వీనర్‌గా ఐసర్ ఆచార్యలు నాగరాజు, కోఆర్డినేటర్ గా డా.జయ సుబ్బారెడ్డి వ్యవహరించనున్నారు.

వ్యవసాయ కళాశాలలో నిరుత్సాహంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆచారి ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది మధ్య జరుగుతున్న క్రీడా పోటీలు సోమవారం నిరుత్సాహంగా సాగాయి. ఈ పోటీలలో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి సిబ్బంది ఆహ్వానం లేకపోవడంతో హాజరు సరిగా కాలేదని తెలుస్తోంది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ బోధన ఉద్యోగుల వార్షిక క్రీడా, సాంస్కృతిక సమ్మేళనంలో రెండో రోజైన సోమవారం పలు క్రీడా, సాంస్కృతిక, వ్యాసరచన పోటీలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థి సంబంధాలు అధికారి డా. ఎం.ఎస్.వి.చలం, విశ్వవిద్యాలయ వ్యాయమ విభాగాధిపతి డా.రవికాంత్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE: PUTTUR
I.A.NO. 249 OF 2024, O.S.No.107 OF 2024

Between:
1.Y. Kumari and another ...Petitioners/ Plaintiffs
And:
1.Y.Chiranjeevi and 7 Others ...Respondents/ Defendants

NOTICE TO THE RESPONDENT NO.1 BY WAY OF PAPER PUBLICATION

To (R1) Y. Chiranjeevi, S/o. Y.Basavaiah, Hindu, aged about 46 years, Business, residing at Brahmana Street, Near Vishnu Mahal Theatre, Karvetinagaram Road, Puttur Town and Mandal, Chittoor dist., now Tirupati Dist., A.P.

Please take notice that the above suit filed against the Respondent No.1 for partition over the plaint schedule mentioned properties by the Plaintiffs and also filed a petition in I.A.No.249/2024 for temporary injunction same is posted to 24-04-2025 for your appearance. If you have got any objections you may appear before this Hon'ble Court, Puttur at 10.30 A.M. on 24-04-2025, either in person (or) through an Advocate and file your objections, if you fail to appear on that day, the matter will be decided exparte.

Sri GALI RAMESH, B.Com., B.L., Advocate, Puttur.

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (JUNIOR DIVISION) CUM JUDICIAL FIRST CLASS MAGISTRATE PUTTUR
O.S.No. 107 OF 2024

Between:
1.Y.Kumari and another ...Plaintiffs
And:
1.Y.Chiranjeevi and 7 others ...Defendants

SUIT SUMMONS TO THE DEFENDANT No.1 BY WAY OF PAPER PUBLICATION

To (D1) Y.Chiranjeevi, S/o.Y.Basavaiah, Hindu, aged about 46 years, Business, residing at Brahmana Street, Near Vishnu Mahal Theatre, Karvetinagaram Road, Puttur Town and Mandal, Chittoor dist., now Tirupati Dist., A.P.

Please take notice that the above suit filed against the Defendant No.1 filed by the plaintiffs for partition over the plaint schedule mentioned properties and same is posted to 24-04-2025 for your appearance. If you have got any objections you may appear before the above said Court at 10.30 AM on 24-04-2025, either in person (or) through an Advocate and file your objections, if you fail to do so, the matter will be decided exparte.

Sri GALI RAMESH, B.Com., B.L., Advocate, Puttur.

సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై శ్రీ కళ్యాణ వెంకన్న

ప్రజాశక్తి - చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన సోమవారం ఉదయం 8 గంటలకు శ్రీనివాసుడు సూర్యప్రభ వాహనంపై శ్రీ మన్నారాయణుడి అలంకారంలో విహరించారు. రాత్రి చంద్రప్రభ వాహనంపై అదృష్టంపజేసి బంగారు ఆభరణాలు, పట్టు వస్త్రాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. వాహనసేవ ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఉత్సవం కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు శ్రీ కళ్యాణ వెంకన్న రథోత్సవం

శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో 8వ రోజైన మంగళవారం ఉదయం 8 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి తెలిపారు. స్వామివారి భక్తులందరూ రథోత్సవంలో పాల్గొనాలని కోరారు.

రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలు పరిష్కరించండి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటరమణ

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రెవెన్యూ సదస్సులలో ప్రజల నుండి వచ్చిన వివిధ సమస్యలకు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేసి పరిష్కారం చేయాలని తహసిల్దార్ కే వెంకటరమణ అన్నారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో హౌసింగ్, ఇరిగేషన్, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అన్వర్ భాష, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ అమృత, మండల విద్యాశాఖ అధికారి మార్కండేయనాయుడు, హౌసింగ్ ఏఈ మహేష్ నాయుడు, ఇరిగేషన్ ఏఈ ఎత్తి రాజులు, ఆర్ఐ లక్ష్మీనారాయణ, వీఆర్వోలు ఝాన్సీ, మల్లికార్జున్, ప్రదీప్ నాయుడు, నరసింహులు, వెంకటరమణ, బాబు, గుణ భూషణ్ నాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు విస్మరించొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గోపి

ప్రజాశక్తి-కోట : మండలంలోని పంచాయితీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని నూతన ఎంపీడీవో గోపి ఆదేశించారు. సోమవారం కోట మండలం, స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గోపి మాట్లాడుతూ ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్బి ఏకొల్లు వేణు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా మొగిలీశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల పరిధిలోని మొగిలి గ్రామ పంచాయతీలో శ్రీ కామాక్షి సమేత మొగిలిశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు సోమవారం ఉదయం ధ్వజారోహణ వైభవంగా నిర్వహించారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమానికి గోమతి స్పిన్నర్ యాజమాన్యం ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం రాత్రి మండల కరుణిగర సంగం ఆధ్వర్యంలో హంస వాహన సేవను నిర్వహించారు. హంస వాహనంపై మొగిలేశ్వరుడు భక్తులకు కనువిందు చేశాడు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కళ్యాణం

పారకాల్వలో వైభవంగా నిర్వహిస్తున్న శివపార్వతుల కళ్యాణం

ప్రజాశక్తి - రామచంద్రపురం : శివపార్వతుల కళ్యాణాన్ని లోక కళ్యాణం కోసం నిర్వహించినట్లు రాష్ట్రీయ సేవా సమితి ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు అన్నారు. రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వెంకటరత్నం సూచనల మేరకు రామచంద్రాపురం మండలం పారకాల్వలోని శ్రీ రాజ రాజేశ్వరి హరి హర బ్రహ్మ దేవాలయంలో పరిసరాల రాస్ మహిళా సంఘ సభ్యులతో మహాశివరాత్రి పర్వదినానికి ముందుస్తుగా శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున లోకం కోసం మహాశివ రాత్రికీ శివ పార్వతుల కళ్యాణం చేయడం ఎంతో మంచిదని పురాణాలు తెలుపుతున్నాయన్నారు. కళ్యాణంలో ఉండే వివిధ క్రతువులను మహిళలకు వివరిస్తూ పూజించడం, సాంప్రదాయాలను గౌరవించడం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలపై అవగాహన కల్పించడం కోసం మహిళలతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా వృద్ధులకు చేతి కర్రలు, దుప్పట్లు, బియ్యం, వినికిడి పరికరాలు పంపిణీ చేశారు. పూజలో పాల్గొన్న మహిళలకు కంకణాలు, ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో రాజరాజేశ్వరి హరి హర ఆలయ అర్చకుల బృందం, నాగేశ్వర్, వాణి, మునిరాజ, సువర్ణరేఖ, లావణ్య, కుప్పమ్మ, అమృతవాణి తదితర మహిళలు పాల్గొన్నారు.

గజ వాహనంపై శ్రీ పల్లి కొండేశ్వర స్వామి కటాక్షం

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం మండలం సురుటుపల్లి, శ్రీ సర్వమంగళ సమేత పల్లికొండేశ్వం స్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారు గజ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఏడవ రోజైన సోమవారం ఉదయం 5 గంటలకు యాగశాల పూజ, 10 గంటలకు శ్రీ పార్వతీ, పరమేశ్వ రుల ఉత్సవ మూర్తులకు అభిషేకం, సాయంత్రం 4 గంటలకు యాగశాల పూజ, పూర్ణాహుతి క్రతువులు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కల్ ఆధ్వర్యం లో అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా జరిపారు. సాయంత్రం 7 గంటలకు గజ వాహనంపై శ్రీ పరమేశ్వరుని, పల్లకి వాహనంలో శ్రీ పార్వతీ దేవిని అధీష్టించి పరిమళాలు వెదజల్లే పుష్పాలు,

స్వర్ణ ఖచిత ఆభరణాలతో అందంగా అలంకరించి విశేష పూజలు చేసి, వివిధ రకాల హారతులు సమర్పించారు. శివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను ఆలయ ఈఓ లత, సిబ్బంది పర్యవేక్షించారు.

వేసవికాలం చోరీలతో అప్రమతంగా ఉండాలి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండ లం, వైయస్సార్ సర్కిల్లో సోమవారం మోటార్ బైక్ వాహన దారులతో మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాలు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎక్కువగా జరుగుతాయని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. ద్విచక్ర వహనదారులు బండి పత్రాలు తమతో ఉంచుకోవలన్నారు. రాత్రి పది తర్వాత వాహన తనిఖీల్లో తప్పనిసరిగా ఆధార్ చూపించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ఉపయోగించాలని సూచించారు.

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

అన్నచెరువు వేలం వాయిదా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని న్యూ మంగళం గ్రామపంచాయతీలో సోమవారం నిర్వహించిన అన్నచెరువు వేలంపాటకు ఔత్సాహికులు ఎవరు హాజరు కాకపోవడంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు కార్యదర్శి మురళీ ప్రకటించారు.

శ్రీ అభయ ప్రసన్న వెంకటేశ్వరునికి వెండి ఆభరణం బహూకరణ

ఆభరణాన్ని ఆలయ అధికారులకు అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాల పేట మండలం, అప్పలాయగుంట శ్రీ అభయ ప్రసన్న వెంకటేశ్వర స్వామికి టీటీడీ విశ్రాంతి ఉద్యోగస్తులు కడప జిల్లాకు చెందిన రాధాకృష్ణారెడ్డి, సరస్వతమ్మ దంపతులు 2 లక్షల 34 వేల రూపాయలు విలువైన 2.25 కేజీల వెండి కంఠ ఆభరణములు బహుకరించారు. వారికి ఆలయ ప్రధానార్చకులు దర్శనానంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

నేరాల నియంత్రణకే విజిబుల్ పోలీసింగ్

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మనోజ్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేరాల నియంత్రణ కోసమే విజిబుల్ పోలీసింగ్ చేపట్టామని గూడూరు రూరల్ ఎస్.ఐ మనోజ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ, గూడూరు డిఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం పోటుపాలెం పరిధిలోని కాశీ లేఔట్, పోటుపాలెం కూడలి వద్ద తనిఖీలు చేపట్టామన్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బందితో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మృతి

బసవరాజు భాస్కర్ రాజు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : విశ్రాంత ఉద్యోగులు సంఘం, అధ్యక్షుడు. ఏపీ పీఎఫ్ సీనియర్ నాయకులు బసవరాజు భాస్కర్ రాజు సోమవారం పుత్తూరు మండలం, ఒంటిమిట్ట లోని ఆయన గృహంలో మృతి చెందారు. సంఘ సభ్యులు, ఉపాధ్యా యులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తిరుపతి జిల్లా కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వెంకటగిరి: రాష్ట్రంలోని అన్ని గిరిజన తెగలల్లో అత్యధిక జనాభా కలిగిన యానాదులు 10 లక్షల మందికి పైగా ఉన్నారని, కానీ ఆర్థికంగా, సామాజికంగా, ఉద్యోగ పరంగా వారికి తీవ్ర నష్టం జరుగుతుందని, గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం ఎస్టీ వర్గీకరణ చేసి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యానాదుల అభివృద్ధికి తోడ్పడాలని సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో కోరారు. తిరుపతి జిల్లా కేంద్రంగా ఐటిడిఏ ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా చిత్తూరు, అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాలోని యానాదులకు ఆర్థికంగా స్వయం ఉపాధి రుణాలు పొందటకు సులభం అవుతుందని, తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభమ్ బాన్సాల్‌కు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అత్తూరు చంగల్ రాయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపాటి వెంకటరమణ, మహిళా నాయకురాలు రేవతి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి పరిసర ప్రాంతాలలోని భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని భవన నిర్మణ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సుబ్బు యాదవ్ ఆర్డిఓ రామ్మోహన్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డప్ప, గోపి, మధు, షేక్ ఖాదర్ వలీ, కృష్ణా నాయక్, మహేష్, మస్తాన్, రఘు, లోక తదితరులు పాల్గొన్నారు.